మార్పు కనిపించింది..

- వినియోగంలో దుర్గి ప్రభుత్వ జూనియర్ కళాశాల భవనం
- జోరుగా అభివృద్ధి పనులు
- రూ.76లక్షలతో రూపురేఖల మార్పు..


కళాశాలను సందర్శించిన ఎమ్మెల్యే పీఆర్కే(ఫైల్)

దుర్గి: పాలకులు సమర్థులైతే.. సమాజంలో మార్పు స్పష్టంగా కనిపిస్తుంది. కోట్లాది రూపాయల ప్రజాధనంతో నిర్మించిన దుర్గి ప్రభుత్వ జూనియర్ కళాశాల గత టీడీపీ ప్రభుత్వంలో నిరుపయోగంగా మారింది. పాలకుల నిర్లక్ష్యం కారణంగా తరగతులు కూడా నిర్వహించుకోలేని దుస్థితి ఏర్పడింది. కళాశాల ప్రాంగణంలో ముళ్ల కంపతో చిన్నపాటి అడవిని తలపించింది. కానీ, ఈ పరిస్థితులు ప్రస్తుతం పూర్తిగా మారిపోయాయి.

వినియోగంలోకి భవనం..

మౌలిక వసతులు, సదుపాయాలు లేక స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలోని రెండు గదుల్లో ఇంటర్ విద్యను కొనసాగిస్తున్నారు. ఇంటర్ విద్యార్థుల రాకతో 10వ తరగతి విద్యార్థులు ఇబ్బందులు పడ్డారు. ఈ సమస్యను జూనియర్ కళాశాల ప్రిన్సిపల్, సిబ్బంది పల్నాడు జిల్లా వైఎస్సార్ సీపీ అధ్యక్షుడు పిన్నెల్లి రామకృష్ణారెడ్డి దృష్టికి తీసుకెళ్లారు. ఆయన వెంటనే స్పందించి గతేడాది జనవరిలో ప్రజాప్రతినిధులు, విద్యార్థుల తల్లిదండ్రులతో కలిసి కళాశాలను సందర్శించారు. ప్రస్తుత విద్యా సంవత్సరానికి పూర్తి స్థాయిలో ఇక్కడే విద్యనభ్యసించేలా చర్యలు తీసుకుంటానని హామీనిచ్చారు. అన్నట్లుగానే.. ప్రభుత్వం నుంచి రూ.76లక్షల నిధులు మంజూరు చేయించి, అభివద్ధి పనులకు శంకుస్థాపన చేశారు. అలాగే స్థానిక ప్రజాప్రతినిధులు, దుర్గి ఏఎంసీ చైర్మన్ వెలిదండి గోపాల్, జెడ్పీటీసీ శెట్టిపల్లి యలమంద, దాతలు, గ్రామ ప్రజల నుంచి రూ. 4.75లక్షలు విరాళాల రూపంలో సేకరించారు. వీటితో పాటు కళాశాల ప్రిన్సిపాల్, సిబ్బంది నుంచి రూ. 3.70లక్షలను సేకరించి కళాశాల పునరుద్ధరణకు శ్రీకారం చుట్టారు. కళాశాల ప్రహరీ నిర్మాణం, మరుగుదొడ్ల అభివృద్ధి, తరగతిగదుల్లో ఫర్నీచర్ ఏర్పాటు చేశారు. ప్రాంగణంలోని ముళ్లకంపను పూర్తిగా తొలగించారు. దీంతో ఈ విద్యాసంవత్సరం నుంచి తరగతులు కళాశాలలో నిర్వహించారు. మొదటిగా 170 అడ్మిషన్లు పొందినట్లు ప్రిన్సిపల్ సీహెచ్ వి.రమణ తెలిపారు. ఎంపీసీ, బైపీసీ, సీఈసీ విభాగాలను తెలుగు, ఇంగ్లీషు మీడియంలలో బోధిస్తున్నారు. కళాశాల పూర్తిస్థాయిలో అందుబాటులోకి రావటంతో చుట్టుపక్కల గ్రామాల ప్రజలు, విద్యార్థులు హర్షం వ్యక్తం చేశారు.


ముళ్లకంప మధ్యలో గతంలో కళాశాల భవనం..


ప్రస్తుతం..

ఎమ్మెల్యే, గ్రామస్తుల సహకారం మరువలేనిది..



కళాశాలను పూర్తిస్థాయిలో వినియోగంలోకి తీసుకొచ్చేందుకు ఎమ్మెల్యే పిన్నెల్లి రామకృష్ణారెడ్డి, గ్రామస్తుల కృషి మరువలేనిది. తరగతుల నిర్వహణకు సహకరించిన స్థానిక ప్రజా ప్రతినిధులు, దాతలు, ప్రజలుకు కృతజ్ఞతలు. భవనం అందుబాటులోకి రావడంతో..తరగతుల నిర్వహణ సులభతరమైంది.

– ప్రిన్సిపల్, సీహెచ్‌వీ రమణ, జూనియర్ కళాశాల

క్లుప్తంగా

నేడు కోదండరాముని విగ్రహ ప్రతిష్ఠ



కారెంపూడి: నరమాలపాడు గ్రామంలో నూతనంగా నిర్మించిన శ్రీ కోదండరామ స్వామి ఆలయ ప్రతిష్ఠా మహోత్సవం శనివారం నిర్వహించనున్నారు. చారిత్రక ప్రసిద్ధి చెందిన ఆలయ జీర్ణోద్ధరణ పనులు పూర్తయ్యాయి. ఉదయం 9.18 గంటలకు గర్భగుడిలో స్వామివారి విగ్రహ ప్రతిష్ఠ చేయనున్నారు. ఈ సందర్భంగా అన్నదానం చేయనున్నారు. ప్రతిష్ఠామహోత్సవానికి ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే పిన్నెల్లి రామకృష్ణారెడ్డి, వైఎస్సార్ సీపీ యూత్ వింగ్ జోనల్ కన్వీనర్ పిన్నెల్లి వెంకటరామిరెడ్డిని ఆలయ కమిటీ ఆహ్వానించింది. గ్రామ సర్పంచ్ గుండ్లకుంట వెంకటేశ్వరరెడ్డి, ఆలయ కమిటీ, అర్చకులు పిన్నెల్లి వంశీకృష్ణశర్మ ఆధ్వర్యంలో గ్రామస్తులు ఏర్పాట్లు చేస్తున్నారు.

ముగిసిన వైద్య శిబిరం



పిడుగురాళ్ల: అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకొని శ్రీదత్త సూపర్ స్పెషాలిటీ హాస్పిటల్‌లో మూడు రోజుల నుంచి నిర్వహిస్తున్న ప్రత్యేక మహిళా ఉచిత వైద్య శిబిరం శుక్రవారంతో ముగిసింది. ఈ సందర్భంగా వైద్యులు పరీక్షలు నిర్వహించారు. డాక్టర్ గార్లపాటి జ్ఞానేశ్వరీ ఆరోగ్య రక్ష, డయాబెటిక్ హెల్త్ కార్డులు మహిళలకు పంపిణీ చేశారు. దాదాపు 600 మంది హాజరైనట్లు నిర్వాహకులు తెలిపారు. ఈ కార్యక్రమంలో హాస్పిటల్ ఎండీ డాక్టర్ గార్లపాటి కృష్ణకాంత్, మేనేజర్ కృష్ణ ప్రసాద్, సిబ్బంది పాల్గొన్నారు.

ఉచిత వైద్య సేవలు

పిడుగురాళ్ల: పట్టణంలోని అంజిరెడ్డి హాస్పిటల్‌లో శుక్రవారం ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. దాదాపు 60 మందికి గుండెకు సంబంధించిన పరీక్షలు నిర్వహించి, సూచనలు అందించారు. డాక్టర్ లోకిరెడ్డి శ్రీనివాస్‌రెడ్డి, డాక్టర్లు, వైద్య సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

రైతులకు అండగా ప్రభుత్వం



దాచేపల్లి: రైతులకు అండగా రాష్ట్ర ప్రభుత్వం ఉందని జెడ్పీటీసీ మూలగొండ్ల ప్రకాష్‌రెడ్డి అన్నారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో మండలస్థాయి వ్యవసాయ సలహా మండలి సమావేశం శుక్రవారం జరిగింది. రాయితీపై ఎరువులను ప్రభుత్వం ఇస్తోందని, వ్యవసాయ పనిముట్లపై సబ్సిడీని సద్వినియోగం చేసుకోవాలన్నారు. పంటల దిగుబడి, లాభాలు పొందేలా వ్యవసాయశాఖ అధికారులు సలహాలు ఇవ్వాలని కోరారు. ఈ సమావేశంలో సలహా మండలి చైర్మన్ షేక్ జాకీర్‌హుస్సేన్, వైస్ ఎంపీపీ కందుల జాను, ఏఓ డి. పాపకుమారి, సొసైటీ అధ్యక్షుడు బత్తుల లింగారెడ్డి, సభ్యులు పాల్గొన్నారు.

అంగన్వాడీ టీచర్ తొలగింపునకు చర్యలు

కారెంపూడి: రాష్ట్ర ఫుడ్ కమిషన్ చైర్మన్ విజయ ప్రతాప్‌రెడ్డి మండలంలోని చింతపల్లి అంగన్‌వాడీ కేంద్రాన్ని శుక్రవారం సాయంత్రం ఆకస్మికంగా తనిఖీ చేశారు. రిజిస్టర్లు పరిశీలించారు. పౌష్టికాహారం పంపిణీపై విచారించారు. విధులు సరిగా నిర్వహించని అంగన్‌వాడీ టీచర్ శివ పార్వతిని విధుల నుంచి తొలగించాలని జిల్లా పీడీకి సిఫార్సు చేయనున్నట్లు చెప్పారు. ఎవరైనా విధి నిర్వహణలో అలసత్వం వహిస్తే.. సహించేది లేదన్నారు. పిల్లలు, గర్భిణులు, బాలింతలకు మెనూ ప్రకారం నాణ్యమైన భోజనం పెట్టాలని స్పష్టం చేశారు.

నులిపురుగుల నివారణ మాత్రలు పంపిణీ



కారెంపూడి: మండలంలోని అన్ని ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల హెచ్‌ఎంలకు నులి పురుగుల నివారణ మాత్రలు (అల్బెండజోల్) ఎంపీడీఓ జి.శ్రీనివాసరెడ్డి, ఎంఈఓ వేముల నాగయ్య శుక్రవారం పంపిణీ చేశారు. మండలంలో ఉన్న 49 పాఠశాలల్లో 9,722 మంది విద్యార్థులకు మాత్రలు వేయనున్నట్లు అధికారులు తెలిపారు. ఏఎన్‌ఎం, ఆశా వర్కర్ల పర్యవేక్షణలో మధ్యాహ్న భోజనం తర్వాత వీటిని వేసే విధంగా చూడాలని హెచ్‌ఎంలకు సూచించారు.

సచివాలయం ఆకస్మిక తనిఖీ

విజయపురిసౌత్: మాచర్ల మండలం చింతల తండా గ్రామ సచివాలయాన్ని గురజాల డివిజనల్ అభివృద్ధి, మాచర్ల మండల స్పెషల్ ఆఫీసర్ గబ్బునాయక్, మాచర్ల ఎంపీడీఓ కోటేశ్వరావు శుక్రవారం ఆకస్మిక తనిఖీ చేశారు. రికార్డులు పరిశీలించారు. సిబ్బంది, వలంటీర్ల పనితీరు, హాజరుపై ఆరా తీశారు. సిబ్బందికి పలు సూచనలను చేశారు. పంచాయతీ కార్యదర్శి వెంకటేశ్వర్లు నాయక్ ఉన్నారు.

అన్నివర్గాల సంక్షేమమే ధ్యేయం

టీడీపీ నుంచి వైఎస్సార్ సీపీలోకి 25 కుటుంబాలు


సమావేశంలో మాట్లాడుతున్న పీవీఆర్

మాచర్ల రూరల్: అన్ని వర్గాల సంక్షేమమే ధ్యేయంగా పాలన సాగించి, విశాఖపట్నంలో గ్లోబల్ ఇన్వెస్టర్స్ సమ్మిట్ నిర్వహించి దేశం యావత్తు రాష్ట్రాభివృద్ధి వైపు చూసేలా చేసిన ఘనత సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిదేనని వైఎస్సార్ సీపీ రాష్ట్ర యువజన ప్రధాన కార్యదర్శి పిన్నెల్లి వెంకట్రామిరెడ్డి అన్నారు. శుక్రవారం రాత్రి మండలంలోని రాయవరం గ్రామంలో టీడీపీ నాయకులు వైఎస్సార్ సీపీలోకి చేరిన సందర్భంగా నిర్వహించిన సభలో ఆయన మాట్లాడారు. వైఎస్సార్ సీపీ ప్రభుత్వాన్ని మెచ్చి పార్టీలో చేరుతున్న ప్రతి ఒక్కరికీ సముచిత స్థానం కల్పిస్తామన్నారు. టీడీపీకి చెందిన 25 కుటుంబాలు గాలి ముసలయ్య, గాలి వెంకటేశ్వర్లు, వెంకట నారాయణ, కొండలు, శ్రీనివాసరావు, బ్రహ్మం, నరసింహరావు, ఉప్పలపాటి వీర వెంకటేశ్వర్లు తదితరులకు పార్టీ కండువా కప్పి పీవీఆర్ వైఎస్సార్‌సీపీలోకి ఆహ్వానించారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ మండల నాయకులు చిలమకూరి వెంకటేశ్వరరెడ్డి, సర్పంచ్ పి.సుందరలీల, ఎంపీటీసీ మట్టా వెంకటేశ్వర్లు, నాయకులు పెండ్లి రామసుబ్బారావు, జి.లక్ష్మారెడ్డి, బూసా తామసయ్య, నాగెండ్ల బాబు, పినపాటి ప్రవీణ్, కొమ్ము ఏసుపాదం, నాగెండ్ల శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

నూతన చర్చి ప్రారంభం

వెల్దుర్తి: మండలంలోని ఉప్పలపాడు గ్రామంలో నూతనంగా నిర్మించిన జీసెస్ క్రైస్ట్ కల్వరి కృప మినిస్ట్రీస్ నూతన మందిరాన్ని వైఎస్సార్ సీపీ యూత్ జోనల్ ఇన్‌చార్జి పిన్నెల్లి వెంకట్రామిరెడ్డి శుక్రవారం ప్రారంభించారు. రూ. 50లక్షలతో చర్చిని నిర్మించటం సంతోషకరమన్నారు. అనంతరం చర్చి పాస్టర్ సుందరరావు పీవీఆర్‌ను శాలువాతో సత్కరించారు. ఈ కార్యక్రమంలో మాచర్ల ఏఎంసీ చైర్మన్ తాడి వెంకటేశ్వరరెడ్డి, మండల వ్యవసాయ సలహా మండలి సభ్యుడు మేకల కోటిరెడ్డి, మందా సీతారామిరెడ్డి, ఏసోబు, హనుమయ్య, యోహాను, తాడి పాపిరెడ్డి, రెడ్డెం వెంకటేశ్వరరెడ్డి, క్రైస్తవ సోదరులు పాల్గొన్నారు.

గ్రామాల సమగ్రాభివృద్ధికి కృషి

మాచవరం: మండలంలోని అన్ని గ్రామాల సమగ్రాభివృద్ధి కృషి చేస్తున్నట్లు ఎంపీడీఓ వై.రాజగోపాల్ పేర్కొన్నారు. స్థానిక మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో సర్వసభ్య సమావేశం శుక్రవారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆయన పాల్గొని, మాట్లాడారు. మండల పరిషత్ నిధులతో గ్రామాల్లో సీసీ రోడ్లు, తాగునీటి వసతి, మౌలిక వసతులు కల్పిస్తున్నట్లు తెలిపారు. మండలానికి జల జీవన్ మిషన్ ద్వారా రూ.15.38కోట్లు మంజూరైనట్లు ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ సురేష్ తెలిపారు. తురకపాలెం, చెన్నాయపాలెం గ్రామాల్లో పనులు పూర్తి కావచ్చాయని చెప్పారు. ఆయా శాఖల పనితీరును అధికారులు వివరించారు. పీఆర్ ఏఈ వెంకటేశ్వరరెడ్డి, మండల అభివృద్ధి కమిటీ చైర్మన్ దారం లచ్చిరెడ్డి, జెడ్పీటీసీ శివాయాదవ్, వైస్ ఎంపీపీలు నన్నే, లక్ష్మయ్య, కో–ఆప్షన్ మెంబర్ జాని, ఎంపీటీసీ సభ్యులు, సర్పంచులు అధికారులు పాల్గొన్నారు.

జాతర నిర్వహణకు ప్రత్యేకాధికారి

దుర్గి: అడిగొప్పల శ్రీ నిదానంపాటి శ్రీలక్ష్మీ అమ్మవారి దేవస్థానం జాతర నేపథ్యంలో ప్రత్యేకాధికారిగా జిల్లా దేవదాయధర్మదాయ శాఖాధికారి సత్యనారాయణరెడ్డిని శుక్రవారం నియమతులయ్యారు. ఈ నెల 12, 13 తేదీల్లో అమ్మవారి జాతర మహోత్సవాన్ని ఆయన పర్యవేక్షించనున్నట్లు ఈఓ శ్రీగిరిరాజు నరసింహబాబు తెలిపారు.

31లోపు పన్నులు చెల్లించండి

మాచర్ల: పురపాలక సంఘ పరిధిలోని ప్రజలు పన్ను బకాయిలన్నింటిని ఈ నెల 31లోపు చెల్లించిటాలని మున్సిపల్ కమిషనర్ ఈవీ రమణబాబు కోరారు. శుక్రవారం పురపాలక సంఘ కార్యాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. సచివాలయాల పరిధిలోని సిబ్బంది, బిల్లు కలెక్టర్లు ఆయా వార్డుల్లో పర్యటిస్తారన్నారు. ఏడాదిగా బకాయిలున్న వారంతా తప్పనిసరిగా పన్నులు చెల్లించాలని స్పష్టం చేశారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

మాచర్ల: విద్యుత్ మరమ్మతుల దృష్ట్యా శనివారం మాచర్ల సబ్ డివిజన్ పరిధిలోని మూడు మండలాల్లో విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు విద్యుత్ శాఖ డిప్యూటీ ఎగ్జిక్యూటీవ్ ఇంజినీర్ ఎ.రామయ్య తెలిపారు. శుక్రవారం ఆయన కార్యాలయంలో విలేకరులతో మాట్లాడారు. శనివారం ఉదయం ఉదయం 9 నుంచి 2గంటల వరకు మాచర్ల పట్టణం, రూరల్ మండలం, దుర్గి, వెల్దుర్తి మండలాల్లో విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు తెలిపారు. ఈ విషయాన్ని గమనించి వినియోగదారులు సహకరించాలని కోరారు.

అదుపు తప్పి ఆటో బోల్తా

విజయపురిసౌత్: విజయపురిసౌత్ నుంచి వేగంగా మాచర్ల వైపు ప్రయాణికులతో వెళ్తున్న ఆటో చింతల తండా వద్ద శుక్రవారం బోల్తాపడింది. ఈ ప్రమాదంలో ఆటోలో ప్రయాణిస్తున్న ఆత్మకూరు గ్రామానికి చెందిన జ్ఞానయ్యకు తీవ్ర గాయాలయ్యాయి. మరో ముగ్గురు స్వల్పంగా గాయపడ్డారు. తీవ్రంగా గాయపడిన జ్ఞానయ్యను మాచర్ల ప్రభుత్వాసుపత్రికి తరలించి, చికిత్స అందించారు. విజయపురిసౌత్ ఎస్ఐ పి అనిల్ కుమార్‌రెడ్డి ఘటనా స్థలానికి చేరుకొని, దర్యాప్తు చేపట్టారు.

నేడు వీఆర్‌ఓల సమావేశం

మాచర్ల రూరల్: పల్నాడు జిల్లా గ్రామ రెవెన్యూ అధికారుల సంఘ సమావేశానికి జిల్లాలోని వీఆర్‌ఓలందరూ పాల్గొనాలని ఆ సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు ఆరుముళ్ళ నాగేశ్వరరావు కోరారు. శుక్రవారం తహసీల్దార్ కార్యాలయంలో విలేకరులతో ఆయన మాట్లాడుతూ.. నర్సరావుపేట లో నల్లపాటి కల్యాణ మండపంలో శనివారం సమస్యల పై చర్చించనున్నామని తెలిపారు. రాష్ట్ర అధ్యక్షుడు భూపతిరాజు, రవీంద్రరాజు నేతృత్వంలో సమావేశం నిర్వహించనున్నట్లు చెప్పారు. ప్రభుత్వానికి అనుకూలంగా ఉంటూ న్యాయమైన విధానంలో తమ పోరాటం కొనసాగిస్తామని చెప్పారు. ఈ కార్యక్రమంలో వీఆర్‌ఓలు పాల్గొన్నారు.

ఆర్టీసీ రాబడి రూ.5లక్షలు

విజయపురిసౌత్: సాగర్‌మాత మహోత్సవాలను పురస్కరించుకుని మాచర్ల నుంచి సాగర్‌కు ప్రత్యేక ఆర్టీసీ బస్సు సర్వీసులు నడపడంతో మాచర్ల ఆర్టీసీకి డిపోకు 5,06,498 రూపాయల ఆదాయం సమకూరినట్లు డిపో మేనేజర్ పిచ్చయ్య శుక్రవారం ఒక ప్రకటనలో తెలియజేశారు. డీజిల్ రేట్లు పెరిగినప్పటికీ టికెట్ రేట్లు పెంచలేదని వివరించారు. గతేడాదికంటే రూ.11,531లు ఎక్కువ వచ్చిందన్నారు.

‘గోరుముద్ద’ను సద్వినియోగం చేసుకోవాలి

ఏపీ ఫుడ్ కార్పొరేషన్ కమిషనర్ చిట్టా విజయ ప్రతాప్‌రెడ్డి


కామేపల్లి అంగన్‌వాడీ కేంద్రంలో రికార్డులు పరిశీలిస్తున్న విజయప్రతాప్‌రెడ్డి

పిడుగురాళ్లరూరల్: రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి పిల్లల భవిష్యత్‌ను దృష్టిలో పెట్టుకొని అందిస్తున్న ‘గోరుముద్ద’ను నూరుశాతం సద్వినియోగం చేసుకోవాలని ఏపీ ఫుడ్ కార్పొరేషన్ కమిషనర్ చిట్టా విజయ ప్రతాప్‌రెడ్డి పేర్కొన్నారు. మండలంలోని కామేపల్లి, బ్రాహ్మణపల్లి గ్రామాల్లోని అంగన్‌వాడీ కేంద్రాలను శుక్రవారం ఆయన సందర్శించారు. బ్రాహ్మణపల్లి హైస్కూల్‌ను సందర్శించి, విద్యార్థులతో ముచ్చటించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా జగనన్న గోరుముద్ద కార్యక్రమాన్ని అమలు చేస్తుంటే.. కనీసం 60శాతం మంది విద్యార్థులు కూడా పాఠశాలల్లో భోజనం చేయకపోవటం చాలా బాధకరమన్నారు. మళ్లీ జూన్, జులైలో వస్తానని నాటికి నూరుశాతం ప్రతి ఒక్క విద్యార్థి పాఠశాలలోనే భోజనం చేయాలని ఆయన సూచించారు. రాష్ట్రంలో ఆరు జిల్లాల్లో పైలెట్ ప్రాజెక్టు కింద తీసుకొని ఫోర్టిఫైడ్ రైస్‌ను అందజేయటం జరుగుతుందన్నారు. కేజీ రూ.60 బియ్యంను విద్యార్థుల తినేందుకు రాష్ట్రం ప్రభుత్వం అందిస్తుందని తెలిపారు. రాగిజావ పంపిణీ కార్యక్రమాన్ని ఈ నెల 21న సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రారంభించబోతున్నారని తెలిపారు. బ్రాహ్మణపల్లి అంగన్‌వాడీ సెంటర్‌లో 33 మంది పిల్లలకు నూరుశాతం నమోదు కావడంతో అంగన్‌వాడీ టీచర్ టి. కృష్ణాంజలి, అంగన్‌వాడీ సహాయకురాలు కమిషనర్ సన్మానించారు. అనంతరం రేషన్ షాపులను పరిశీలించి, స్టాక్ వివరాలు తెలుసుకున్నారు. కామేపల్లి ప్రాథమిక పాఠశాల భోజనశాలలను పరిశీలించారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ చక్రవర్తి, ఎంపీడీవో కాశయ్య, డీటీఎస్ శర్మ, ఎంఈఓ ఒ.రాజు, సీడీపీఓ జోత్స్న మేరిగోల్డ్, సూపర్‌వైజర్లు పి.అంజలి, పి.ప్రసన్నకుమారి, ఎస్.నాగమణి, ఎంపీపీ అల్లు పిచ్చిరెడ్డి, మండల అభివృద్ధి కమిటీ చైర్మన్ ముడేల వెంకటేశ్వరరెడ్డి, గొట్టిముక్కల పవన్‌రెడ్డి, అంగన్‌వాడీ నిర్వాహకురాలు వల్లెం గీత, రాములమ్మ తదితరులు ఉన్నారు.

ప్రభల ఏర్పాటుకు అనుమతి

బొల్లాపల్లి: మండల కేంద్రంలోని శ్రీ వెంకటనారాయణస్వామి తిరునాళ్లను పురస్కరించుకొని విద్యుత్ ప్రభలకు అనుమతికి దరఖాస్తు చేసుకోవచ్చని బండ్లమోటు ఎస్ఐ జె.బలరాంరెడ్డి శుక్రవారం తెలిపారు. వాహనాల రాకపోకలకు ఎటువంటి ఆటంకం లేకుండా ప్రభలు ఏర్పా టు చేసుకోవాలన్నారు.

పచ్చ పత్రిక విలేకరి కోసం.. తెలంగాణ పోలీసులు

లైంగిక వేధింపుల కేసుపై విచారణ

మాచర్ల: లైంగిక వేధింపుల కేసులో ఓ ప్రముఖ పచ్చ దిన పత్రిక విలేకరిని విచారించేందుకు నల్గొండ జిల్లా మిర్యాలగూడెం పోలీసులు శుక్రవారం పట్టణానికి వచ్చారు. కేసుకు సంబంధించి విచారణకు హాజరుకావాలని నోటీసులు అందించారు. వివరాల మేరకు.. మాచర్ల పట్టణంలో కొంతకాలం క్రితం పనిచేసిన ఓ బ్యాంకు ఉద్యోగి భార్యపై సదరు విలేకరి లైంగిక వేధింపులకు పాల్పడ్డాడు. ఆమె నుంచి లక్షల రూపాయలు నగదు తీసుకున్నట్లు ఆరోపణలున్నాయి. ఇదే విషయమై ఆమె మిర్యాలగూడెం పోలీస్ స్టేషన్‌లో ఈ నెల 3న ఫిర్యాదు చేసింది. దీంతో అతనిపై తెలంగాణ పోలీసులు 448, 354ఏ, 509, 506 ఐపీసీ సెక్షన్ల కింద కేసు నమోదు చేశారు. ఈ నేపథ్యంలో పట్టణానికి వచ్చిన టీఎస్ పోలీసులతో.. తనకున్న సమస్యల వల్ల ఈ నెల 15న విచారణకు హాజరవుతానని, అప్పటి వరకు సమయం ఇవ్వాలని లిఖితపూర్వకంగా సదరు విలేకరి కోరినట్లు తెలిసింది. ఈ కేసులో ముందస్తు బెయిల్ కోసం సమయాన్ని తీసుకున్నట్లు సమాచారం. గతంలోనూ మీడియా విలేకరిగా అతను పలువురి వద్ద అప్పులు తీసుకొని ఇవ్వకుండా ఉన్నట్లు సమాచారం. సదరు విలేకరి తీరుపై మాచర్లలో సర్వత్ర చర్చ నడుస్తోంది.

ప్రజలకు సేవ చేయడం అదృష్టం

ఎమ్మెల్యే కాసు మహేష్‌రెడ్డి


బాప్టిస్ట్ చర్చిలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే కాసు మహేష్‌రెడ్డి

దాచేపల్లి: ప్రజలకు సేవ చేయడం తన అదృష్టంగా భావిస్తున్నానని గురజాల ఎమ్మెల్యే కాసు మహేష్‌రెడ్డి అన్నారు. ఇరికేపల్లి తెలుగు బాప్టిస్ట్ చర్చిలో శుక్రవారం జరిగిన ప్రత్యేక ఉపవాస ప్రార్థనలో ఆయన ముఖ్య అతిథి పాల్గొన్నారు. పాస్టర్ ప్రేమయ్య, 17వ వార్డు ఇన్‌చార్జి నాగెండ్ల సుమతీ రత్నం, సంఘస్థులు నాగెండ్ల జయరావు, నాగెండ్ల ఏసయ్య, మాతంగి రాంబాబు, పత్రా రమేష్, గద్దల వేదమణి, నాగెండ్ల యాకోబు, పత్రా ఏలియ్య, నాగెండ్ల మహేష్, నాగెండ్ల మార్కు, కుంపటి నాగరాజు తదితరులు ఎమ్మెల్యేను సన్మానించారు. ఈ సందర్భంగా కాసు మహేష్‌రెడ్డి మాట్లాడుతూ.. ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి తనకు ఎమ్మెల్యేగా అవకాశం ఇవ్వడంతో.. ప్రజలకు సేవ చేయగలుగుతున్నానన్నారు. ప్రజల దీవెనలు, ఏసుక్రీస్తు ఆశీస్సులు తమకు మెండుగా ఉన్నాయన్నారు. జగనన్న అమ్మఒడి, వైఎస్సార్ అసరా, చేయూత వంటి పథకాల ద్వారా ప్రతి కుటుంబానికి మేలు జరిగిందన్నారు. చర్చి ప్రాంగణంలో కమ్యూనిటీ హాలు నిర్మాణానికి రూ.10లక్షల నిధులు ఇస్తున్నామని, అవసరమైతే మరో రూ.10లక్షలు ఎంపీ లావు శ్రీకృష్ణదేవరాయలు నిధుల నుంచి ఇస్తామని ఎమ్మెల్యే కాసు హామీ ఇచ్చారు. మాజీ ఎమ్మెల్సీ టీజీవీ కృష్ణారెడ్డి, నగర పంచాయతీ చైర్మన్ కొప్పుల సాంబయ్య, ఏఎంసీ చైర్మన్ కలకండ ఆంధ్రయ్య, జెడ్పీటీసీ మూలగొండ్ల ప్రకాష్‌రెడ్డి, ఎంపీపీ కటకం జయశ్రీ, మాజీ సర్పంచ్ మందపాటి రమేష్‌రెడ్డి, వైస్ చైర్మన్ కొమెరబత్తిన విజయ్‌కుమార్, మాజీ చైర్మన్ మునగా పున్నారావు, పార్టీ మండల, పట్టణ కన్వీనర్లు కోట కృష్ణ, షేక్ సుభానీ, కౌన్సిలర్లు మందపాటి వీరారెడ్డి, ఈదా వెంకటరెడ్డి, మాజీ మండల కన్వీనర్ షేక్ జాకీర్‌హుస్సేన్, నాయకులు మందపాటి కృష్ణారెడ్డి, నడికుడి సూర్రెడ్డి పాల్గొన్నారు.

సావిత్రీబాయి పూలే జీవితం మహిళలకు ఆదర్శం


సావిత్రీబాయిపూలే విగ్రహానికి నివాళి

సత్రశాల(రెంటచింతల): బాలికల విద్యాభివృద్ధికి యనలేని కృషిచేసిన సావిత్రీబాయి పూలే జీవితం మహిళలకు ఆదర్శమని రెంటచింతల సర్పంచ్ పూజల పుష్పావతి రామయ్య అన్నారు. శుక్రవారం సావిత్రీ బాయి పూలే వర్ధంతిని పురష్కరించుకుని స్థానిక ఏపీ జెన్‌కో నాగార్జునసాగర్ టైయిల్‌పాండ్ విద్యుత్ ప్రాజెక్టు ఆవరణలోని సావిత్రీబాయి విగ్రహానికి ఆమె పూలమాల వేసి, ఘనంగా నివాళులర్పించి మాట్లాడారు. ప్రాజెక్టు ఎస్‌ఈ కె. వెంకటరమణ, ఈఈ కె,శ్రీకాంత్, డీఈ వి.నాగరాజు, ఎస్ఐ గురుమూర్తి, కన్నెగంటి హనుమంతు ఫౌండేషన్ సభ్యులు నారాయణపురం శ్రీనివాసరావు, గాదె లూర్దుమర్రెడ్డి, అధికారులు లతదేవి, కె.సుజాత తదితరులు పాల్గొన్నారు.

వేంకటేశ్వరస్వామికి లక్ష తులసీదళార్చన


వేంకటేశ్వరస్వామి

రెంటచింతల: స్థానిక సుబ్బన్నతోట కాలనీలోని శ్రీ అలివేలుమంగ, పద్మావతి సమేత శ్రీ వెంకటేశ్వరస్వామి దేవస్థానం 19వ వార్షికోత్సవ వేడుకల్లో భాగంగా శుక్రవారం స్వామివారికి లక్ష తులసీదళార్చన వైభవంగా నిర్వహించారు. అర్చకులు ఓరుగంటి మారుతిశర్మ ఆధ్వర్యంలో ఉదయం సుప్రభాత సేవ, పంచా మృతాభిషేకాలు, సుదర్శన హోమాలు తదితర ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించారు. భక్తులకు తీర్థప్రసాదాలను అందజేశారు. దేవస్థానం అధ్యక్షుడు నాళం పెద్దబాబు, పాలక వర్గం సభ్యులు ఏర్పాట్లను పర్యవేక్షించారు.

ప్రజలకు మెరుగైన సేవలు అందించాలి


ఉద్యోగులతో మాట్లాడుతున్న ఆర్డీవో అద్దయ్య, తహసీల్దార్ పుల్లారావు

రెంటాల(రెంటచింతల): సచివాలయాల ద్వారా ప్రజలకు మెరుగైన సేవలు అందించడంతో పాటు ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు అర్హులకు అందేలా పనిచేయాలని గురజాల ఆర్డీవో అద్దయ్య అన్నారు. శుక్రవారం మండల పరిధిలోని రెంటాల గ్రామ సచివాలయాన్ని ఆయన తహసీల్దార్ కె.పుల్లారావుతో కలిసి అకస్మికంగా తనిఖీ చేశారు. రికార్డులు పరిశీలించి సచివాలయాల ఉద్యోగులతో మాట్లాడారు. సచివాలయానికి వచ్చే ప్రజలతో ఏ విధంగా వ్యవహరించాలో వివరించారు. గ్రామస్తుల దరఖాస్తులను వెంటనే ఆన్‌లైన్‌లో నమోదు చేయాలన్నారు. అనంతరం గ్రామంలోని రేషన్‌షాపు తనిఖీ చేసి, రికార్డులు పరిశీలించారు.

విద్యార్థులకు మెరుగైన వసతులు కల్పించాలి

రెంటచింతల: కస్తూర్బా పాఠశాల్లో మెరుగైన వసతులు కల్పిస్తున్నట్లు గురజాల ఆర్డీఓ అద్దయ్య అన్నారు. శుక్రవారం మిట్టగుడిపాడు గ్రామంలోని కస్తూర్బాగాంధీ పాఠశాలను ఆయన తహసీల్దార్ కట్టెకోట పుల్లారావుతో కలిసి ఆకస్మికంగా తనిఖీ చేశారు. వసతి గృహంలో వసతులపై విద్యార్థినులతో మాట్లాడారు. భోజనం, కాస్మోటిక్ చార్జీలు, ఉపాధ్యాయుల తీరు, పాఠాల బోధన తదితర అంశాలపై విద్యార్థినుల ప్రశ్నించారు. వారి సమాధానాలను విన్నారు. బాగా చదువుకుని, మెరుగైన ఫలితాలు సాధించాలని వారికి సూచించారు. విద్యార్థినులతో కలిసి భోజనం చేసి, సంతృప్తిని వ్యక్తం చేశారు.

పెరిగిన వడ్డీరేట్లను సద్వినియోగం చేసుకోవాలి

పిడుగురాళ్ల: పెరిగిన వడ్డీరేట్లను ఖాతాదారులు సద్వినియోగం చేసుకోవాలని ఎస్‌బీఐ బ్రాంచ్ మేనేజర్ రత్నకుమార్ అన్నారు. పట్టణంలో శుక్రవారం ద్విచక్ర వాహన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా రత్నకుమార్ మాట్లాడుతూ అమృత్ కలశ్ డిపాజిట్ స్కీమ్ నందు 400 రోజులకు సాధారణ ఖాతాదారులకు 7.10 శాతం, సీనియర్ సిటిజన్‌లకు 7.6 శాతం వడ్డీ వస్తుందన్నారు. సర్వోత్తమ్ డిపాజిట్ స్కీమ్ నందు ఏడాది, రెండేళ్లకు డిపాజిట్ చేయవచ్చని, సాధారణ ఖాతాదారులకు 7.40 శాతం, సీనియర్ సిటిజన్లకు 7.90 శాతం అత్యధిక వడ్డీ వస్తుందని ఆయన తెలిపారు. బ్యాంక్ సిబ్బందితో పట్టణ పుర వీధుల్లో బైక్ ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో బ్యాంక్ సిబ్బంది కొండా నాయక్, వెంకట్రావు, అనిల్, ఆశీర్వాదం, ప్రభు, శ్రీకాంత్, శ్రీకాంత్‌నాయక్, సుదీర్‌బాషా, గఫూర్ తదితరులు ఉన్నారు.

సంక్షేమం, అభివృద్ధి రెండు కళ్లు

ఎమ్మెల్యే కాసు మహేష్‌రెడ్డి


లబ్ధిదారులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే కాసు

గురజాల: సీఎం వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి అభివృద్ధి, సంక్షేమం రెండు కళ్లలా పరిపాలన అందిస్తున్నారని ఎమ్మెల్యే కాసు మహేష్‌రెడ్డి అన్నారు. మండల పరిధిలోని గోగులపాడు గ్రామంలో శుక్రవారం సాయంత్రం గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే కాసు మహేష్‌రెడ్డి మాట్లాడారు. సచివాలయం, రైతు భరోసా కేంద్రాలతో పరిపాలన సులభతరం చేసిన ఘనత సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికే దక్కుతుందన్నారు. సంక్షేమ పథకాలతో ప్రజలు ఆనందంగా ఉన్నారని పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఇంటింటికీ పర్యటించిన ఎమ్మెల్యే.. సంక్షేమ పథకాల లబ్ధిని అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ రాష్ట్ర అదనపు కార్యదర్శి యెనుముల మురళీధర్‌రెడ్డి, సీనియర్ నాయకుడు కొమ్మినేని వెంకటేశ్వర్లు, ఎంపీపీ కొమ్మినేని నారాయణమ్మ బుజ్జి, వైస్ ఎంపీపీ వేముల శేషమ్మ చలమయ్య, జెడ్పీటీసీ ఆరికట్ల శ్రీనివాసరెడ్డి, మండల కన్వీనర్ సిద్దాడపు గాంధీ, గ్రామ సర్పంచ్ నందెల రాములమ్మ రామిరెడ్డి, ముత్తన బ్రహ్మానందారెడ్డి, బైరెడ్డి కోటిరెడ్డి, మోరసాని రామిరెడ్డి, చిన్ను కాశీరెడ్డి, ముత్తయ్య, గోగులపాడు గ్రామ పెద్దలు పాల్గొన్నారు.